# ఫోటో

" అమ్మమ్మా, రాణీనగరం వెళ్దామే. అక్కడ ఉచితంగా కళ్ళు బాగుచేస్తున్నారట. నీ కళ్ళు బాగుచేయిస్తాగా ? నువ్వు మళ్ళీ స్పష్టంగా లోకాన్ని చూసేలా చేస్తాగా ?" అలా వాసు నాలుగురోజులుగా మణెమ్మను ఊరిస్తూనే ఉన్నాడు.

కానీ, మణెమ్మ లొంగితేనా ?

" కాటికి కాళ్ళు చాచుకున్నదాన్ని. ఎంత ఉచితమైతే మాత్రం ఇప్పుడు నాకు వైద్యాలెందుకురా ? నిన్ను చూడగలను. నీకు అన్నం వండి పెట్టగలను. అది చాలదూ ?"

ఒక్కగానొక్క కూతురు చచ్చిపోతే మనుమడిని కనిపెట్టుకుని ఉంటోంది మణెమ్మ. అల్లుడు ఎవతెనో ఉంచుకొని ఆమె దగ్గరే కాపురం చేస్తుంటాడు. కొడుకును చూచిపోవడానికి అప్పుడప్పుడు వస్తుంటాడు. తిండి ఖర్చులు ముట్టచెప్పిపోతుంటాడు.

"పోనీ నా కోసం రావే అమ్మమ్మా, ప్లీజ్ ... ఇవాళ ఆఖరి రోజు కూడా". అసలు విషయం బయటపెట్టాడు.

" నీ కోసమా! నీ కళ్ళకేమయింది?"

" నా కళ్ళు నిక్షేపంగా ఉన్నాయి. కళ్ళ కోసం కాదు. వాగ్దేవి గారి ఉపన్యాసం వినాలి. ఆమెను చూడాలి. ఐ కాంప్ ఆఖరిరోజు జరుగుతున్న సభకు ఆమె ముఖ్య అతిథిగా వస్తోంది"'.

వాగ్దేవి! వాగ్దేవి ఎవరు ? సినిమా తార కాదుకదా! ఛీఛీ తన మనవడికి సినిమాతారల కోసం ఎగబడే నీచాభిరుచులు లేవు.

మరెవరామె?

" వాగ్దేవి గారంటే ఈ జిల్లా కలెక్టరుగారమ్మమ్మా. చాలా గొప్ప పరిపాలకురాలుగా పేరు పొందింది. చదువుకొనే రోజుల్లో అన్నిట్లో ఫస్టేట. ఐ.ఎ.ఎస్. అని కలెక్టరు ఉద్యోగాలకి పరీక్ష ఉందిలే. అందులో ఫస్టు వచ్చింది. చాలా గొప్ప వక్త. అంతకన్నా మించి గొప్ప గొప్ప ఆదర్శాలున్న వ్యక్తి. పేపర్లో చదివాను. ఒక్కసారి ఆమె ఉపన్యాసం వినాలని ఉందే అమ్మమ్మా ..."

" నా తండ్రే ... నా తండ్రే... ఎంత గొప్ప ఆలోచనలున్నాయిరా నీ చిన్న బుర్రలో . అన్నీ మా నాన్నగారి పోలికలే. అలాగే వెళ్దాం" అంటూ మనమడిని దగ్గరికి తీసుకొని ముద్దు పెట్టుకొంది.

"కానీ, ఒక్క కండిషన్ అమ్మమ్మా. ఎలాగూ వెళ్తున్నాం కనుక నీ కళ్ళు కూడా చూపించుకోవాలి".

"అలాగే పద".

✡ ✡ ✡

" ఇది పంతులుగారి సత్రం కదూ? అదేదో కాంప్ అన్నావు కదా? సత్రానికి తీసుకొచ్చేవేమిట్రా అబ్బిగా " మణెమ్మ సత్రంలో అడుగు పెట్టబోతూ ఆగి అడిగింది.

" సత్రమా! పేరుకే సత్రం. ఈ ఊళ్ళో ఏ మీటింగులు జరిగినా ఇక్కడే జరుగుతూంటాయి. బోర్డులు ... బానర్లు... రంగు రంగు కాగితం తోరణాలు ... కనిపించటం లేదూ?"

మణెమ్మకు అవేమీ కనిపించటం లేదు.

యాభై అరవై సంవత్సరాల క్రితం ఆ సత్రం వచ్చిపోయే పాంథులతో కళకళలాడుతూండే దృశ్యం ఆమె కళ్ళ ముందు ప్రత్యక్షమయింది...

రెండొందలమందికి ఏకపంక్తిన వండి వడ్డించటానికి తగిన ఏర్పాట్లు చేసి ఆ సత్రాన్ని కట్టించారు పంతులుగారు అనే దానశీలి.

ఆ రోజుల్లో హోటళ్ళు లేవు. అన్నాన్ని అమ్ముకోవడం దోషంగా భావించే రోజులు. అన్నదానం చేస్తే పుణ్యం వస్తుందని విశ్వాసం ఉండేది.

అందుచేత ధనవంతులు ప్రతి ఇరవై మైళ్ళకు ఒక చోట అన్నసత్రాలు ముఖ్యదారి పొడుగునా కట్టించారు. అలాంటి సత్రాలన్నింటిలోకి ఇది చాలా పెద్ద సత్రం. కుల మత వ్యత్యాసాలు లేకుండా అన్నదానం చేసే నిమిత్తం తన ఆస్తినంతటినీ ఈ సత్రానికి సమర్పించారు పంతులుగారు.

"త్వరగా నడువు అమ్మమ్మా. మళ్ళీ టైమ్ అయిపోతుందేమో ! నీ కళ్ళ పరీక్షచేయించాలి గదా?" మణెమ్మను పరీక్ష చేశారు.

" మామ్మగారూ. మీ కంటి జబ్బుకు చికిత్సలేదు.మీ జబ్బు యింతకన్నా పెరగదు. తరగదు.".

త్వరగా తెమిలిపోయింది.

మీటింగుకు చాలా సమయం ఉంది.

ఈ లోగా ఏం చెయ్యటం ?

"అమ్మమ్మా అలా ఊరు చూచి వద్దామా?"

"ఊళ్ళో చూచేదేముందిరా? వీధులు, కొట్లేగదా? ఈ సత్రం నాలుగు మూలలు తిరిగి చూద్దాం."

సత్రం చాలా పెద్దది. చాలా స్ట్రాంగ్‌గా, అన్ని సదుపాయాలతో కట్టేరు. కానీ, పోషణ, అలంకరణలు లేని అందగత్తెలా కళావిహీనంగా ఉందిప్పుడు.

"ఒరేయ్ అబ్బిగా, ఈ గదిలోనే ఒకప్పుడు ఆహారధాన్యాలు భద్రపరిచేవారు. అదిగో అల్లది వంటగది. ఎంతెంత పెద్ద గదులనుకొన్నావ్? ఇలా రా. ఈ గదిలో బాటసారులు విశ్రాంతి తీసుకునేవారు."

అమ్మమ్మ చెప్తున్న దాన్ని వాసు చిత్రంగా వింటున్నాడు.

ఆమె చూపించిన గదులన్నీ తాళాలేసి ఉన్నాయి. ద్వారబంధాలకు బూజులు

తోరణాల్లా వేలాడుతున్నాయి.

ఒక గది వద్ద ఎరువుల వాసన, మరో గది దగ్గర పురుగు మందుల వాసన.

బహుశా ఆ గదులు గిడ్డంగులుగా మారేయేమో?

"దొడ్లో పెద్ద బావి ఉండాలి. ఎంత పెద్దదనుకున్నావ్? పది గిలకలు ఉండేవి. రోజుకు పదివేల మంది స్నానపానాలు చేసినా చుక్క తరిగినట్లు కనబడేది కాదు. అమృతంలాంటి నీళ్ళు అనుకో. పద పద చూపిస్తాను."

దొడ్లో బావి ఉంది. గిలకలు మాత్రం లేవు.

బావిలోకి తొంగిచూశాడు వాసు.

"బాబోయ్" అని అరిచాడు.

"గొలు... దుర్గంధం, ఈ బావి నువ్వు చెప్పిన బావి కానట్లుంది అమ్మమ్మా. పాడుబడిన బావి ఇది."

మణెమ్మ నవ్వింది.

"బావి తనంత తాను పాడు పడదురా అబ్బీ... సత్రాన్ని పాడుబెట్టినట్లు గానే మనుషులే బావినికూడా పాడుబెట్టి ఉంటారు. అన్నదానం ఆగాక నీటితో మాత్రం అవసరం ఏముంటుంది? ఇదిగో... ఈ హాలులోనే రోజూ అయిదారు వందల విస్తర్లు లేచేవి. తెల్సా?'

"మీటింగు జరిగేది కూడా ఇప్పుడు ఈ హాలులోనే అమ్మమ్మా. అదిగో, ఆ కుర్చీలో కూర్చో, మీటింగు ఆరంభం అయ్యే టయిమవుతున్నది లే.'

✡ ✡ ✡

కుర్చీలన్నీ నిండిపోయాయి.

కార్యకర్తలు, నిర్వాహకులు ముఖ్య అతిథి కోసం ఎదురుచూస్తూ గేటు దగ్గర బారులు తీరి నిలబడ్డారు.

చిన్న చిన్న రెవెన్యూ అధికారులు, ఆ సత్రం నిర్వహణాధికారి, అతని ఉద్యోగ బృందం నీట్‌గా డ్రస్ చేసుకొని వినయం ఉట్టిపడే మొహాలతో ఓ చోట నిలబడ్డారు. మరో వైపు ధర్మకర్తలు లాంటి ఊరిపెద్దలు.

ఆ సత్రం హిందూ దేవాదాయ ధర్మాదాయ చట్టం క్రింద ప్రభుత్వం చేత నిర్వహించబడుతూంది. ఆ సత్రానికి పంతులుగారు ఇచ్చిన భూములు ఊరి పెద్దల సాగుబడిలో ఉన్నాయి.

పెద్దలు మరింత పెద్దలుగా పెరిగిపోతున్నారు. ఆ ఊరికి వచ్చిన నిర్వహణాధికారులు ఆ ఊళ్ళోనే శాశ్వతంగా ఉండాలని కోరుకుంటారు. ఆ పోస్టు అంత రుచికరమైనది వాళ్ళకి.

సరిగ్గా సమయానికి జీపు వచ్చి సత్రం గుమ్మం ముందు ఆగింది.

అందులోనుంచి వాగ్దేవి దిగింది.

ఇచ్చకాల మాటలు...పూలమాలలు...పొగడ్తలు...అధికారుల హడావుడి...

వాగ్దేవి జీపు దిగి ఆ పురాతన సత్రాన్ని ఒక్క క్షణం పరిశీలనగా చూచింది. గేటు పక్క

గోడలో తాపటం చేసి ఉన్న ఒక పాలరాతి పలకను చూచింది.

పాలరాతి మీద అక్షరాలన్నీ చెరిగిపోయి ఉన్నాయి. దుమ్ము పేరుకుపోయి ఉంది. వాగ్దేవి తన చేతిగుడ్డతో మట్టిని తుడిచి అక్షరాలను చదివే ప్రయత్నం చేసింది. 'పంతులు...' ఆ మూడక్షరాలే మిగిలాయి. పేరులోని మిగతా అక్షరాలు మాయమయ్యాయి.

"మీటింగ్‌కు అంతా సిద్ధంగా ఉన్నది మేడమ్.." రోటరీ క్లబ్ ప్రెసిడెంటో ప్రముఖుడో ఒకతను, గడియారం చూచుకుంటూ అన్నాడు. అతని కళ్ళముందు టి.వి.లో రాబోయే కార్యక్రమాలు మెదులుతున్నాయి.

"మీరు సభను ప్రారంభించండి. నేను సత్రాన్ని ఒక్కమారు చూచి వస్తాను" అంటూ ఆమె తహసిల్దారు వైపు చూచింది.

తహసిల్దార్, సత్రం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌వైపు చూచాడు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుమాస్తా వైపు, అతను ప్యూను వైపు చూచాడు.

"చిత్తం..రండి...రండి..."

వాగ్దేవికి చిన్నతనం నుంచి చరిత్ర అభిమాన విషయం. చరిత్రలో మహాపురుషుల జీవితాలు ఆమెకు ఉత్తేజాన్నిచ్చాయి. మార్గదర్శకం చేశాయి.

జగన్నాధంపంతులుగారు కటిక పేదరికంలో పుట్టారు. తల్లి పురిట్లోనే పోయింది. తాగటానికి పాలుకూడా లేని పరిస్థితి. తరువాత పేదరికం మనిషిని ఎన్ని రకాలుగా బాధలు పెట్టగలదో అనుభవం ద్వారా తెల్సుకొన్నాడు. పట్టెడన్నం కోసం కొన్ని మైళ్ళు నడిచిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

క్రమంగా అతనికి పేదరికాన్ని జయించాలన్న పట్టుదల కలిగింది.

మధూకరాలు చేసి చదువుకొన్నాడు. బారిస్టరై రెండు చేతులా సంపాదించాడు. కొంత కాలం భోగాలను అనుభవించాడు. సంసారం వృద్ధయింది.

'డబ్బు సంపాదించడం ఒక ఎత్తు. దాన్ని సక్రమంగా ఖర్చుపెట్టడం మరో ఎత్తు... నా ఉద్దేశ్యంలో మొదటిదానికన్నా రెండోది చాలా కష్టం. ఎందుకంటే సంపాదించిన డబ్బు మనిషిని ఖర్చు పెట్టనివ్వదు. ఇంకా సంపాదించు ఇంకా సంపాదించు అని వేపుకు తింటుంది. ఆశా వ్యామోహాలతో బంధిస్తుంది.' అలా అనేవాడాయన ఎప్పుడూ.

కొడుకులు, కూతుళ్ళు పెద్దవాళ్ళయ్యాక వారినందరినీ ఒకరోజు సమావేశపర్చాడు.

"నేను స్వయంశక్తితోకటిక దరిద్రాన్ని జయించాను. డబ్బు సంపాదించాను. కానీ, ఈ డబ్బు నా దని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఇది పేదలది. నేను ధర్మకర్తను మాత్రమే. మీరు మీ కాళ్ళమీద నిలబడి జీవించటం నేర్చుకోవాలి. అలాగని మిమ్మల్ని నిరుపేదలుగా చేస్తానని అనుకోవద్దు. స్వయంశక్తితో బతకటానికి అవసరమైన ధనాన్ని మీలో ప్రతి ఒక్కరికి ఏర్పాటు చేశాను. ఇవిగో కాగితాలు. ఇక మీకు ఈ ఆస్తితో సంబంధం లేదు. కుటుంబ కీర్తి అపకీర్తులకు మాత్రమే వారసులవుతారు మీరు."

ఆ తరువాత ఆయన ఆర్జించిన ధనాన్ని సక్రమంగా ఖర్చు చేయటానికి ప్రణాళికలు వేసేడు.

ఎందరు పేద విద్యార్థులకు గుప్తదానాలు చేశాడో? ఎన్ని సంస్థలను పోషించాడో? ఎన్ని ప్రజా ఉద్యమాలను నిలబెట్టాడో?

కుడిచెయ్యి చేస్తున్న పని ఎడమ చెయ్యికి తెలీకుండా చేశాడు.

రాణీ నగరంలో సత్రాన్ని కట్టించాడు. ప్రతి నిత్యం కొందరు బాటసారులకు, పేద విద్యార్థులకు, అన్నార్తులకు అన్నాన్ని పెట్టే ఏర్పాటు చేశాడు.

రాణీనగరం ఆ రోజుల్లో బాగా వెనుకబడ్డ ప్రాంతం.

అలాంటి చోట అన్నార్తులను ధనవంతులు కాకపోతే ఎవరు ఆదుకొంటారు?

సత్రాన్ని స్వయంగా నిర్వహించేవారాయన.

వందలకొద్దీ జనం రోజూ కడుపు నిండా భోజనం చేస్తుంటే చూచి అమితానందాన్ని పొందేవాడు.

ఆర్జించిన భూములనన్నింటిని ఆ సత్రానికి రాసిచ్చాడు.

జగన్నాధం పంతులు పోయేనాటికి మిగిలింది 'దాత' అన్న ఖ్యాతిమాత్రమే. ఆర్జించిన ఆస్తి నంతటినీ ప్రజలకే అందించానన్న తృప్తితో మరణించాడు.

చిత్రం ఏమంటే సత్రం నిర్వహణకు నియమించిన ట్రస్టీలలో తన వాళ్ళ నెవరినీ నియమించలేదు. అసలు తన కులం వారినే నియమించలేదు. పేద కులాల వారినే ధర్మకర్తలుగా విల్లులో రాసిపోయాడు.

ఆ తరువాత ఆ పేదలే ధనవంతులయ్యారు.

జగన్నాధంపంతులుగారి ఆస్తికి మేమే వారసులమని కొట్లాడుకొని కోర్టులకెక్కారు.

సత్రం భూముల కౌలుదారులు, భూములకు, యజమానులు కాని యజమానులయ్యారు. సత్రానికొచ్చే ఆదాయం పైసా పెరగలేదు. కానీ, భూమి మీద ఆదాయం మాత్రం పదింతలు ఇరవై ఇంతలు పెరిగింది. ధర్మకర్తలు, కౌలుదార్లు ముఠాలుగా చీలారు, కొట్టుకొన్నారు.

చివరికి ఊరి పెద్దలంతా ఓ అంగీకారానికి వచ్చారు.

వంతులవారీగా పంతులుగారి ఆస్తిని అనుభవించాలి.

అలా వంతు రాని వాళ్ళెవరో ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ సత్రాన్ని తీసేసుకుంది.

పంతులుగారి ఆస్తికి అధికారుల రూపంలో వారసులు బయలుదేరారు.

"ప్రస్తుతం సత్రంలో రోజుకు ఎంతమందికి అన్నం పెడ్తున్నారు?" వాగ్దేవి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ని అడిగింది.

ఏం చెప్తే ఏం ముంచుకొస్తుందో?

"పది మందికి..." నిజమే చెప్పాడు.

"రెండొందలమందికి అన్నదానం చెయ్యాలని కదా పంతులుగారు ఆస్తి ఇచ్చిపోయింది'

"అవును మేడమ్, కానీ, భూములమీద ఆదాయం పదిమందికే చాలడం లేదు."

"ఓ! ఆ పది మందికి ఏం పెడ్తారు?"

"అన్నం, కూర, సాంబారు, రసం, మజ్జిగ."

"భోజనాల గది, వంటశాల చూపిస్తారా?"

వాటిని చూచింది వాగ్దేవి.

"ఈ గదులన్నీ దుమ్ము పట్టి ఉన్నాయే! క్లీన్ చేయించరా?"

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీళ్ళు నమిలేడు.

" ఆ గదులన్నీ తాళాలు బిగించారు. లోపలేమున్నాయి?"

అలా అన్నీ చూచి వివరాలు తెలుసుకుంది వాగ్దేవి.

సభ జరిగే హాలులోకి వచ్చింది. అంతా లేచారు.

గోడకు మహాత్మాగాంధీ, జవాహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మొదలైన దేశనాయకుల ఫొటోలు వేలాడుతున్నాయి. స్థానిక నాయకుల బొమ్మలు కూడా ఉన్నాయి.

"దేశనాయకుల ఫొటోలు పెట్టారు, బాగుంది. కానీ, ఈ సత్రం నిర్మాణం చేసిన జగన్నాథంపంతులుగారి ఫొటో కనబడదేం? ఆయన ఫొటో తెప్పించండి. సభ అయ్యేలోగా తీసుకురావాలి. నేను స్వయంగా ఆయన ఫొటోను గోడకు తగిలిస్తాను. తెలిసిందా?"

"ఎస్సార్...సారీ..సారీ...ఎస్, మేడమ్."

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు ముచ్చెమటలు పోశాయి.

సభ ఆరంభమయింది అక్కడ.

✡ ✡ ✡

"ఫొటో...ఫొటో...పంతులుగారి ఫొటో..." ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను ఈగలా పట్టుకొని సొదపెట్టసాగాడు తహసీల్‌దార్ ఇవతల.

"ఫొటో...ఫొటో...పంతులుగారి ఫొటో..." ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తన క్రింది స్టాఫ్‌మీద ఆంబోతులా రంకెలు వేయసాగాడు.

గదులన్నీ తెరిపించి వెతికారు. ఫొటో కనిపించందే?

"అసలు మీలో ఎవరన్నా ఆ పంతులుగారి ఫొటోను ఎప్పుడన్నా చూశారా?"

చూడలేదని తలలు అడ్డంగా ఊపారంతా.

"అందరూ మర్చిపోయిన ఆ పంతులుగారి ఫొటో ఇప్పుడీ అమ్మగారికెందుకో?" అంటూ చిరాకు పడబోయి నాలుక కర్చుకొని తహసీల్‌దారును చూచి 'సారీ' చెప్పుకున్నాడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్.

"ఊళ్ళో ఎవరింట్లోనన్నా ఉందేమో వాకబు చేసుకురండి." స్టాఫును తలా ఒక దిక్కుకు పంపించాడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్.

"ఊళ్ళో పెద్దలు చాలామంది ఇక్కడే ఉన్నారుగా? ఒక్కొక్కరినీ మెల్లగా పిలిపించి

అడిగితే మంచిదేమో?" తహసీల్ దార్ సలహా ఇచ్చాడు.

సభ అయ్యేలోగా ఫొటో అక్కడికి రావపోతే జరగబోయేదేమిటో అతనికి తెలుసు.

ఊరి పెద్దలను పిలిపించి ఫొటో గురించి అడిగారు.

వారు కూడా పంతులుగారి ఫొటోను చూడనైనా లేదు. కొందరికైతే ఆయన పూర్తి పేరు కూడా తెలియదు.

ఈలోగా ఊళ్ళోకి వెళ్ళిన వాళ్ళు కూడా ఒట్టిచేతులతో తిరిగి వచ్చారు.

ఇక పంతులుగారి ఫొటో కోసం తాపత్రయపడి లాభంలేదు.

"ఇది చాలా సీరియస్ వ్యవహారం ఎగ్జికూటివ్ ఆఫీసర్ గారూ. ఈ సత్రం స్థాపించిన వారి ఫొటో అయినా కనీసం లేదంటే కలెక్టర్‌గారు ఊరుకోరు. ఊరి పెద్దలతో ఆలోచించి ఏదన్నా ఉపాయం ఆలోచించండి. మీ మేలు కోరే చెప్తున్నాను."

తాహసీల్‌దార్ భావన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు అర్థమయింది.

కాస్సేపు ఆలోచించి ఊరి పెద్దలను నలుగురిని పిల్చి మాట్లాడాడు.

ఆ తరువాత అంతా కలిసి ఊరిమీద పడ్డారు హడావుడిగా!

✡ ✡ ✡

సభలో చివరి అంశం ముఖ్య అతిథి ఉపన్యాసం.

వాగ్దేవి ఉపన్యాసం ఇవ్వటానికి లేచి అటూ ఇటూ చూచింది.

తహసీల్ దారు ఆమె వద్దకి వచ్చి వినయపూర్వకంగా ఏమో చెప్పాడు.

"సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. పేదలకు దృష్టి దానం చేయటానికి రోటర్లీ కబ్‌వారు తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని నేను అభినందిస్తున్నాను. ఈ సభలో నేను పాల్గొనటానికి మరో ముఖ్య కారణం కూడా ఉంది. ఈ సత్రాన్ని స్థాపించిన గంటి జగన్నాథంపంతులుగారి పట్ల నాకు గల గౌరవం అది. జగన్నాథం పంతులుగారి చరిత్ర మీలో చాలామందికి తెలియకపోవచ్చు. కానీ, చిన్నతనంలో ఆయన చరిత్ర విని ప్రేరణ పొందిన వ్యక్తిని నేను. ఆయన నిర్మించిన సత్రాన్ని చూస్తే, ఆయన్ని చూచిన అనుభూతి కలుగుతుందని వచ్చాను. కానీ, నాకా అనుభూతి కలగలేదు. మానవుడిలో, కృతజ్ఞతాతత్వం బాగా లోపిస్తున్నదేమో ననిపించింది. మానవుడికి ఉండాల్సిన లక్షణాలలో కృతజ్ఞతా లక్షణం ముఖ్యమైనది. అది లేనివాడు పశువుతో సమానం. ఈ సత్రాన్ని స్థాపించిన ఓ మహోన్నత వ్యక్తిని ఈ ఊరు, ఈ ఊళ్ళో ప్రజలు ఇంత త్వరగా మర్చిపోవటం ఆరోగ్యకరమైన లక్షణం కాదు. కనీసం ఆ మహావ్యక్తి ఫొటో అన్నా సత్రంలో లేకపోవటం చాలా పెద్ద ఘోరఅన్యాయంగా కనిపిస్తున్నది. ఆ పంతులుగారి ఫొటోను ఇప్పుడు దేశనాయకుల సరసన పెట్టటానికి నేను సంతోషిస్తాను."

వాగ్దేవి ఆగింది.

అప్పుడు రొప్పుకుంటూ లోపలికొచ్చాడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్.

చేతిలో ఉన్న పెద్ద ఫొటో వాగ్దేవికి అందించాడు.

వాగ్దేవి ఫొటోను చూచింది. అలా చూస్తూ రెండు నిముషాలు నిలబడింది.

"ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గారు ఇప్పుడే పంతులుగారి ఫొటోను పట్టుకొచ్చి నాకిచ్చారు. కానీ, ఈ ఫొటోను చూస్తుంటే నాకెందుకో పంతులుగారిని చూచిన అనుభూతి కలగటంలేదు. పంతులుగారి పట్ల నేను పెంచుకొన్న తీవ్ర అభిమాన దోషం వల్లనేమో నాకు తెలియదు. కానీ, ఇంతమందిలో పంతులుగారి ఫొటోను చూచినవారు కొందరైనా ఉండకపోరు. అలాంటి వారుంటే ఈ ఫొటోను చూచి పంతులుగారి ఫొటోగా గుర్తించ ప్రార్థిస్తున్నాను."

సభ నిశ్శబ్దమయింది. ఫొటోను గుర్తించటానికి ఎవరూ రాలేదు.

"ఈ సత్రాన్ని మనం ఎన్నో విధాలుగా ఉపయోగించుకుంటున్నాం. ఇప్పుడు సభను పెట్టుకొన్నాం. ఈ సభలో ఈ సత్ర స్థాపకుడిని గురించి ఒక్క సెకండు ఆలోచించిన వారు లేకపోయారు. కనీసం ఆయన బొమ్మను చూచిన వారు కూడా లేరా? ఒక్కరు...ఒక్కరంటే ఒక్కరుకూడా లేరా?"

వాగ్దేవి గొంతు గద్గదమయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఉన్నానమ్మా, నేనున్నాను." వెనుకనుంచి ఓ గొంతు బలహీనంగా వినిపించింది. అంతా మణెమ్మ వైపు చూచారు.

"ముసలమ్మా, కూర్చో, కూర్చో, నీకెందుకు?" ఎవరో మెల్లగా అన్నారు.

కానీ, ఆ మాటల్ని మణెమ్మ పట్టించుకోలేదు.

"కానీ, నాకు ఆ ఫొటో కనిపించదు తల్లీ, కళ్ళకి మసకలు, దగ్గరికి వచ్చి చూడనామ్మా...కలెక్టరమ్మా"

వాగ్దేవి తహసీల్దారు వైపు చూచింది.

మణెమ్మను వాసు వేదిక దగ్గరికి తీసుకెళ్ళాడు.

"నా మనవడు నీవెంత గొప్పదానివో చెప్పేడమ్మా. నిన్ను చూడాలని, నీ ఉపన్యాసం వినాలని నన్ను మా ఊరినుంచి లాక్కొచ్చాడు. నిన్ను చూచి ఇప్పుడు నేను గర్విస్తున్నాను.."

మణెమ్మ ఫొటో దగ్గరగా కళ్ళు పెట్టి చూచింది. దూరంనుంచి చూచింది. మళ్ళీ మళ్ళీ చూచింది.

"గంటి జగన్నాధంపంతులుగారి ఫొటో కాదమ్మా ఇది."

మణెమ్మ గొంతు హెచ్చించి అంది.

"మనుషుల మస్తిష్కాలను, మోసం, అవినీతి అనే పురుగులు ఎలా తొలుస్తున్నాయనే దానికి ఇదో నిదర్శనం. ఈ సత్రంలో జగన్నాధంగారి ఫొటో లేకపోవటమే ఒక పొరపాటు., దానికి తోడు ఎవరి ఫొటోనో ఆయన ఫొటో అని జనాన్ని మభ్యపెట్టాలన్న ప్రయత్నం... ఓహ్... భగవంతుడా! రక్షించు ఈ జనాన్ని. ఉద్ధరించు వారి నైతిక విలువల్ని!"

వాగ్దేవి మనసు విలవిల లాడిపోయింది. హృదయం క్షోభించింది. నయనాలు శోకించాయి.

"ఆ ఫొటో పంతులుగారిదని ఊరివాళ్ళు ఇచ్చారు. కాదంటున్న ఆ ముసలమ్మ

ఎవరో తెలియదు. ఈ ఊరు మాత్రం కాదు. అలాంటి ఆ ముసలామె మాటల్ని విశ్వసించి ఈ ఫొటో పంతులుగారిది కాదని మీరు నిర్ణయానికి వచ్చేయటం ఎంతవరకు సమంజసం కలెక్టర్‌గారూ? స్థానికుల మాటకన్నా మీరు ఆమె మాటకే విలువ ఇస్తున్నట్లు దాని అర్థం కదా? ఇంతకీ ఆ ముసలామె ఎవరు? ఆమెకు పంతులుగారు ఎలా తెలుసు? ఆ ఫొటో పంతులు గారిది కాదని ఆమె నిరూపించగలదా?"

వాగ్దేవి కొట్టినట్లయి ఆ ప్రశ్నలు వేసిన అతని వైపు చూచింది.

ఖద్దరు బట్టలు... తలపైన గాంధీ టోపీ, స్థానిక రాజకీయవేత్తలా ఉన్నాడు.

"అవును, అదీ పాయింటే..." రొటేరియన్లలోని ఓ ప్లీడరుగారు వత్తాసు పలికారు.

"అమ్మా, ఇంతకీ మీరెవరు? చూడబోతే కటిక బీదరికంలో ఉన్నట్టున్నారు. మీకు గంటి జగన్నాధంపంతులుగారు ఎలా తెలుసు? ఈ ఫొటో ఆయనది కాదని ఎలా నిరూపించగలరు?"

మణెమ్మ ఒక్క క్షణం ఆలోచించింది. తల అడ్డంగా ఊపుతూ అందరికీ నమస్కరించి నాలుగడుగులు వెనక్కి వేసి వెళ్ళబోయింది.

"మామ్మ గారూ..." వాగ్దేవి పిలిచింది.

"అమ్మమ్మా, నువ్వలా వెళ్ళిపోతే కలెక్టరుగారి పరువు నిలుస్తుందా? ఎంత అవమానమో ఆలోచించు?" వాసు మణెమ్మ చెవిలో గట్టిగా అన్నాడు.

మణెమ్మ వెనక్కి తిరిగి వాగ్దేవి కళ్ళలోకి చూచింది.

"అమ్మా, కలెక్టరమ్మా తల్లీ. గంటి జగన్నాధంపంతులుగారు మరణించే ముందు అచ్చు ఇప్పుడు నేను ఉన్నట్లుగానే ఉండేవారు. ముమ్మూర్తులా ఆయన పోలికే నాది. ఎందుకంటే... నేను... నేను..."

"మీరు...?"

"నే నాయన కూతురిని."

ఆంధ్రప్రభ వారపత్రిక ఉగాది కథల పోటీలో బహుమతి పొందిన కథ 30-4-86